క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ఏటూరునాగారం : అనారోగ్య సమస్యతో ప్రైవేట్ ఆస్పత్రిలో చేరి చికిత్స చేయించుకున్న బాధితులకు సీఎం సహాయ నిధి నుంచి చెక్కులను అందజేసినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు తెలిపారు. శనివారం స్థానిక బస్టాండ్ ఆవరణలో చెక్కులను బాధితులకు అందజేశారు. జాడిసమ్మయ్య, దొడ పెద్ద వెంకటయ్య, సాదారి రాజీవ్‌మోక్ష, కర్నె బుచ్చమ్మ, అట్టి పెంటమ్మ, బందెల రవి, షైక్ ఆర్షియా, జాడి యాదమ్మలకు చెక్కులను అందజేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, గుడ్ల దేవేందర్, వావిలాల ఎల్లయ్య, ఖలీల్, పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలి

వెంకటాపురం(కె) : పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా ఇన్‌చార్జ్ చాతాల రమేష్ అన్నారు. శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్లలో పారిశుద్ధ్య కార్మికులకు మంజూరు చేశారని అన్నారు. ఇట్టి ఇళ్లను జిల్లా వ్యాప్తంగా నిలిపివేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేయటం సరైన పద్ధతి కాదని అన్నారు. సమావేశంలో నాయకులు శివ, స్వామి, వేల్పుల మనోజ్, యాసం వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిర్మయిని ఆదర్శంగా తీసుకోవాలి



జ్యోతిర్మయిని సన్మానిస్తున్న కల్యాణి

ఏటూరునాగారం: ఇటీవల రొయ్యూర్‌కు చెందిన సాదారి జ్యోతిర్మయిని తోటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు రేగ కల్యాణి అన్నారు. రామయ్య కుమారి కుమార్తె బీపీఈడీలో స్టేట్ 1 ర్యాంక్ రావడంతో ఆమెను కల్యాణి సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పేద కుటుంబం నుంచి జ్యోతిర్మయి ఫస్ట్‌ర్యాంక్ రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ ఉన్నత స్థాయిలో ఉద్యోగం రావాలని ఆమె కోరారు.

ఆర్థికసాయం

మంగపేట: మండల కేంద్రం పరిధిలోని పాదుమూరుకు చెందిన బద్ది పాపారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబానికి వాడబలిజ జిల్లా అధికార ప్రతినిధి కలాల రాంబాబు 50 కిలోల బియ్యం, రూ 1,000 నగదును ఆర్థికసాయంగా శనివారం అందజేశారు. పరామర్శించిన వారిలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఉన్నారు.

అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలి

వెంకటాపురం(కె): మండలంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని టీడీపీ మండల అధ్యక్షుడు తాళ్లూరి లక్ష్మణరావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలో ఇందిరమ్మ ఇల్లు లేనివారికి ఇవ్వకుండా కాంగ్రెస్ కార్యకర్తలకే మాత్రమే ఇచ్చారని ఆయన ఆరోపించారు. నిరుపేద కుటుంబాలకు ఇల్లు రాలేదని వాపోయారు. ఇల్లు మంజూరు చేయాలని లేనిపక్షంలో పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

మోదీ పథకాలపై ప్రచారం



పథకాలపై ప్రచారం చేస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని సున్నంబట్టి వీధిలో శనివారం కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 11 ఏళ్ల పాలనలో చేపట్టిన ప్రజాసంక్షేమ కార్యక్రమాలపై మండల బీజేపీ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల కరపత్రాలను ప్రజలకు అందిస్తూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రామెళ్ల రాజశేఖర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు బోల్లే సునీల్, అంకాల దుర్గా, మండల ఉపాధ్యక్షులు తోట సతీష్, నాయకులు పాల్గొన్నారు.

మహిళ బ్యాగు అపహరణ

ములుగు రూరల్ : జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో మహిళ బ్యాగు అపహరణకు గురైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ములుగు నుంచి హనుమకొండకు వెళ్లేందుకు మహిళ తన బ్యాగ్‌ను బస్టాండ్‌లో పక్కన పెట్టి బస్సు కోసం వేచి చూస్తుంది. ఈ క్రమంలో బ్యాగ్ కోసం వచ్చిన మహిళకు బ్యాగ్ కనిపించకపోవడంతో ఒక్కసారిగా అవాక్కైంది. విలువైన వస్తులు ఉన్నాయని విలపిస్తూ పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిసింది.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు ఆయుష్షు పెరుగుతుందని పలువురు వక్తలు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం కళాశాలలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉపాధ్యాయులతో కలిసి సూర్య నమస్కారాలు, ఆసనాలు, ధ్యానం వరకు మెలకులవను వివరిస్తూ పలు యోగసనాలు వేయించారు. కార్యక్రమాల్లో ఏఎస్పీ, ఐటీడీఏ ఏపీఓ, సీఐ, ఎస్సైలు, ఎంఈఓలు, ఉపాధ్యాయులు, ఆయా పార్టీల నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు. - సాక్షి, నెట్‌వర్క్



ఏటూరునాగారం : యోగా అసనాలు చేస్తున్న ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ఐటీడీఏ ఏపీఓ వసంతరావు, గురూజీ రాంబాబు



ఎస్ఎస్‌తాడ్వాయి : మోగాసనాలు చేస్తున్న విద్యార్థులు, తదితరులు



గోవిందరావుపేట : విద్యార్థులతో కలిసి యోగా చేస్తున్న పస్రా ఎస్సై కమలాకర్



వాజేడు: యోగాసనాలు వేస్తున్న ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్, సిబ్బంది



మంగపేట : యోగా చేస్తున్న విద్యార్థిని, విద్యార్థులు



గోవిందరావుపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆసనాలు వేస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థినులు



మంగపేట : ఇంటర్నేషనల్ యోగా డే ఆకారంలో విద్యార్థులు

అధికారుల తీరుపై ప్రజల విమర్శలు

మంగపేట : మండలంలోని మల్లూరు గ్రామపంచాయతీ పరిధిలోని మామిడిగూడెం గిరిజన ఇసుక క్వారీ సొసైటీ నిర్వాహణలో భాగంగా టీజీఎండీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వే బ్రిడ్జి నిర్మాణం విషయంలో పంచాయతీ, రెవెన్యూ అధికారుల వ్యవహరించిన తీరుపై ప్రజల నుంచి విమర్శలు వినవస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు వే‌బ్రిడ్జి నిర్మాణానికి ముందుగా టీజీఎండీసీ అధికారులు ముందు స్థల కేటాయింపు కోసం రెవెన్యూ అధికారులకు, నిర్మాణం కోసం గ్రామ పంచాయతీ నుంచి పెసా గ్రామసభ తీర్మాణం కొరకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. అలా కాకుండా తమను అడిగేవారే లేరనే ధీమాతో పంచాయతీరాజ్ రోడ్డును అనుకుని ప్రభుత్వ స్థలంలో రెడీమెడ్ క్యాబిన్, వే‌బ్రిడ్జిని నిర్మించి నిర్వాహణ కొనసాగిస్తున్నారు. దీనిపై సంబంధిత రెవెన్యూ, పంచాయతీ అధికరులకు ఫిర్యాదు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా వే‌బ్రిడ్జి నిర్మాణం చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. అయినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకుండా కలెక్టర్ అనుమతులు ఇవ్వమన్నాడని చెప్పి ఆగమేఘాల మీద గ్రామ పంచాయతీ అధికారులు శనివారం ప్రత్యేక గ్రామ సభ నిర్వహించి వే‌బ్రిడ్జి నిర్మాణం కోసం ఎన్‌ఓసీ ఇవ్వడం, అనుమతులు



నిర్మాణం పూర్తయిన వే‌బ్రిడ్జికి స్థలాన్ని కేటాయిస్తు అనుమతులు అందజేస్తున్న తహసీల్దార్, ఆర్ఐ

లేకుండా నిర్మించిన వే‌బ్రిడ్జి వద్దకు రెవెన్యూ అధికారులు వచ్చి నిర్మాణం కోసం అంటూ 3 గుంటల ప్రభుత్వ స్థలాన్ని అప్పగించడం పలు రకాల విమర్శలకు తావిస్తోంది. సంబంధిత అధికారుల కనుసన్నల్లోనే అక్రమంగా వే‌బ్రిడ్జి నిర్మాణం జరిగిందని, అందుకు సంబంధిత అధికారులకు పెద్దమొత్తంలో ముడుపులు ముట్టాయనే ఆరోపణలు ఉన్నాయి. విషయం బయటకు రావడంతో తమకేమీ తెలియదనే విధంగా బ్రిడ్జికి నూతనంగా స్థలాన్ని కేటాయించడం, నిర్మాణం కోసం అంటూ గ్రాసభ తీర్మానంతో ఎన్‌ఓసీ ఇవ్వడం ఒక పథకం ప్రకారం జరిగిందనే ఆరోపణలు వినవస్తున్నాయి.

ప్రతీ ఒక్కరూ హెల్మెట్ ధరించాలి

● జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీశ్



జర్నలిస్టులకు హెల్మెట్లు పంపిణీ చేస్తున్న ఎస్పీ శబరీశ్

ఎస్ఎస్‌తాడ్వాయి: ప్రతీ ఒక్క ద్విచక్రవాహనాదారుడు హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీశ్ అన్నారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని జర్నలిస్టులకు హెల్మెట్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమస్యలను వెలికి తీసి ప్రభుత్వానికి ప్రజలకు వారిధిగా పని చేసే జర్నలిస్టుల పాత్ర చాలా గొప్పదన్నారు. ప్రతీ ఒక్కరు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రతికల ద్వారా ప్రచురించి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పస్రా సీఐ రవీందర్ ఉన్నారు.

జయశంకర్ ఆశయాలను కొనసాగిద్దాం

సాక్షి, నెట్‌వర్క్ : జయశంకర్ సార్ ఆశయాలను కొనసాగిద్దామని పలువురు కొనియాడారు. శనివారం ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతిని నిర్వహించారు. జయశంకర్ విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సిద్ధించడానికి అనేక కష్టాలను ఓర్చుకొని రాష్ట్రం కోసం అనేక పోరాటాలు చేశారన్నారు. బడుగు, బలహీన వర్గాలతో పాటు విద్యార్థులను ఏకం చేస్తూ అనేక ఉద్యమంలో మొదటి వరుసలో ముందున్నాడన్నారు. ఆయనను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, అధికారులు, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, పాల్గొన్నారు.



గోవిందరావుపేట : జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



మంగపేట : తెంగాణ తల్లి విగ్రహం వద్ద జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నేతలు



ఏటూరునాగారంలో..



వెంకటాపురం(ఎం)లో..

విద్యాసంస్థ పరిధిలో మద్యం షాపులు నిర్వహించకూడదు



లిటిల్ ఫ్లవర్ పాఠశాల సమీపంలో ఉన్న దుకాణాన్ని తనిఖీ చేస్తున్న సీఐ సురేష్

ములుగు రూరల్ : విద్యా సంస్థల పరిధిలో మద్యం, పొగాకు ఉత్పత్తుల అమ్మకాలు చేపట్టకూడదని సీఐ సురేష్ అన్నారు. శనివారం లిటిల్ ఫ్లవర్ స్కూల్ పరిధిలోని కిరాణా షాపులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సీఐ మాట్లాడుతూ విద్యా సంస్థల పరిధిలో సుమారు 100 మీటర్ల పరిధిలో ఎలాంటి మద్యం అమ్మకాలు, పొగాకు ఉత్పత్తులను అమ్మినట్లయితే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని 16 పాఠశాలల పరిధిలో తనిఖీ చేపట్టారు విద్యాసంస్థలకు టీజీఎన్ఏబీ వారు విడుదల చేసిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎస్సై వెంకటేశ్వర్‌రావు, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

వెంకటాపురం(కె): పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటామని వైద్యాధికారి స్నేహరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వెంగళరావు పేట, నూగూరు, తిప్పాపురం గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల పై అవగాహన కల్పించారు. వైద్యాధికారి అశీష్, మనోహర్, డీపీఎంఓ సత్యనారాయణ ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రత్నం రాజేందర్

ఎస్ఎస్‌తాడ్వాయి : లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 9న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం రాజేందర్ కార్మికులకు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మండల కేంద్రంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సమ్మక్క అధ్యక్షతన జరిగిన సీఐటీయూ మండల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించడానికి, నాలుగో లేబర్ కోడ్ లను రద్దు చేయడమే లక్ష్యంగా కార్మిక వర్గ ఐక్యపోరాటలను ఉధృతం చేస్తూ జాతీయ స్థాయిలో కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మెలో ప్రతీ కార్మికుడు పాల్గొనాలని పిలుపునిచ్చారు. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు చిరంజీవి, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలకు నోట్‌బుక్స్ పంపిణీ

గోవిందరావుపేట : మండల కేంద్రానికి చెందిన వీరపనేని రామదాసు వెంకటసుబ్బమ్మల జ్ఞాపకార్థంగా ఆయన కుమారుడు డాంగే మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు రూ.3.50 లక్షల విలువ చేసే నోట్‌బుక్స్ శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి గొంది దివాకర్ హాజరై మాట్లాడుతూ డాంగే గతంలో గోవిందరావుపేటలోని ప్రభుత్వ పాఠశాలలో చదివినందుకు గాను పదేళ్ల నుంచి పిల్లలకు నోటుబుక్స్ ఉచితంగా పంపిణీ చేస్తున్నందున వారికి కృతజ్ఞతలు తెలిపారు.

భూ భారతి చట్టాన్ని ఆదివాసీలకే వర్తింపజేయాలి

వాజేడు : ఏజెన్సీలో భూభారతి చట్టాన్ని ఆదివాసీలకే వర్తింపజేయాని ఆదివాసీ నవనిర్మాణ సేన మండల అధ్యక్షుడు మోడెం నాగరాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివాసీ నవనిర్మాణ సేన ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయగా ఆయన మాట్లాడారు. 1970 తరువాత షెడ్యూల్ ఏరియాలో వలస గిరిజనేతరులకు పట్టాలు చేయవద్దని ఎల్‌టీఆర్ చట్టం చెపుతున్నప్పటికీ నేటికి అధికారులు కబ్జా చేసిన ప్రభుత్వ భూములకు పట్టాలు చేస్తున్నట్లు ఆరోపించారు. దరఖాస్తు గడువును ఇంకా పొడిగించాలని కోరారు.

సకాలంలో ఇళ్ల నిర్మాణ పనులు పూర్తిచేయాలి

వాజేడు: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల ను లబ్ధిదారులు సకాలంలో పూర్తి చేయాలని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ కోరారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీకాంత నాయుడుతో కలిసి ఇంది రమ్మ



ఇంటి నిర్మాణానికి ముగ్గు పోస్తున్న దృశ్యం

ఇళ్లకు శనివారం ముగ్గు పోయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా సుమారు 800 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. మండల అభివృద్ధికి మంత్రులు, కలెక్టర్ సహకారం అందిస్తున్నారని వివరించారు. ఇళ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేస్తేనే దశల వారీగా అకౌంట్లలో డబ్బులు జమ అవుతాయని వివరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 22 అడుగుల వెడల్పు, 18 అడుగుల పొడవుతో ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

● ఏఎస్పీ శివం ఉపాధ్యాయ



ఏటూరునాగారం: డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

ఏటూరునాగారం : విద్యార్థులు, యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఏఎస్పీ శివం ఉపాధ్యాయ అన్నారు. శనివారం మండల కేంద్రంలో క్రాస్‌రోడ్డు క్రీడామైదానంలో అభయమిత్ర కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీవితంలో విద్యార్థి దశ అత్యంత కీలకం అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మత్తుమందులు, అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండే విధంగా పల్లె పల్లెలో అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. అన్ని వర్గాల ప్రజలు పోలీసులకు సహకరించి డ్రగ్స్ రహిత జిల్లాగా మనం పేరుతెచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈనెల 22న మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం, 23న మండల ప్రధాన కార్యాలయలలో మండల విద్యాధికారి, స్కూల్ ప్రధాన టీచర్లతో ప్లాంటేషన్ డ్రైవ్, 24న అన్ని గ్రామాల్లో డిజిటల్ ఎంగేజ్మెంట్ ప్లాన్ సోషల్



సన్‌రైజ్ పాఠశాలలో యాంటి డ్రగ్‌పై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ రవీందర్

మీడియా ద్వారా వీడియో క్లిప్స్ ప్రచారం, 25న అన్ని స్కూళ్లలో వ్యాసరచన, మాదకద్రవ్యాల వ్యతిరేక పోస్టర్ల తయారీపై పోటీలు, 26న జిల్లా కేంద్రంలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా యువతతో ర్యాలీ ఉంటుందన్నారు. ఏపీఓ వసంతరావు, సీఐ శ్రీనివాస్, ఎస్సై రాజ్‌కుమార్, పాల్గొన్నారు.

ములుగు రూరల్ : మత్తుపదార్థాల నియంత్రణపై ప్రతీ ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని డీఎస్పీ రవీందర్ అన్నారు. శనివారం యాంటి డ్రగ్ అవేర్నెస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక సన్ రైజర్స్ పాఠశాలతో పాటు జాకారం సోషల్ వెల్ఫేర్ పాఠశాల, జంగాలపల్లి బ్రాహ్మణి పాఠశాల, సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సీఐ సురేష్, ఎస్సై వెంకటేశ్వర్‌రావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

మంగపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మత్తు పదార్థాలు, డ్రగ్స్‌పై ట్రైనీ ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు.

జీపీ కార్యాలయాల్లో రుణమాఫీ జాబితా



వెంకటాపురం(కె): పంచాయతీ కార్యాలయాల వద్ద రుణమాఫీ రైతుల ఫ్లెక్సీలు

వెంకటాపురం(కె)/వెంకటాపురం(ఎం): మండలాల్లోని గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద రుణమాఫీ పొందిన రైతుల జాబితా ఫ్లెక్సీలను శనివారం వ్యవసాయాధికారులు నవీన్, శైలజ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. శనివారం ఎదిర, బర్లగూడెం, నూరవీడు, వెంకటాపురం, నల్లగుంట, నారాయణగిరిపల్లి, సింగరకుంటపల్లి, తిమ్మాపూర్, పాపయ్యపల్లి, కేశవపురం, అడవిరంగాపూర్, నర్సాపూర్ గ్రామపంచాయతీల్లో రుణమాఫీ పొందిన రైతుల జాబితాను ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట రుణమాఫీ పొందిన రైతుల సమక్షంలో ఆవిష్కరించారు. ఎంత మంది రైతులు రుణమాఫీ పొందారో జాబితాలో వారిపేరును చెక్ చేసుకోవచ్చని తెలిపారు.

మరమ్మతులకు గురైన పాఠశాలలను పరిశీలించాలి

వాజేడు : మండలంలో మరమ్మతులకు గురైన పాఠశాలల భవనాలను ఇంజనీరింగ్ అధికారులతో పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీకాంత్‌నాయుడుతో పాటు ములుగు జిల్లా డీఈఓ కార్యాలయానికి ఎంఈఓ వెంకటేశ్వర్లు వినతి పత్రాలను ఇచ్చారు. మండలంలోని ఎంపీపీఎస్ బొమ్మన పల్లి, ఎంపీపీఎస్ కోరకల్, ఎంపీపీఎస్ పెద్ద గొళ్లగూడెం, ఎంపీపీఎస్ చింతూరు(వంటషెడ్డు), ఎంపీపీఎస్ పాయబా టలు, ఎంపీయూపీఎస్ లక్ష్మీపురం (వంట షెడ్డు), ఎంపీయూపీఎస్ చంద్రుపట్ల, ఎంపీయూపీఎస్ ఏడ్జెర్లపల్లి, జెడ్పీహెచ్ఎస్ వాజేడు నాగారం శిథి లావస్థలో ఉన్నాయని పేర్కొన్నారు. సమీపంలో నూ తనంగా



ఇన్‌చార్జ్ ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న ఎంఈఓ

నిర్మించిన భవనాల్లో పాఠశాలలు కొనసాగుతున్నప్పటికీ వీటిని పరిశీలించి తొలగించడం లేదా మరమ్మతులు చేయడం చేపట్టాలని కోరారు. అందుకు వాటి నాణ్యతను పరిశీలించి అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

క్రైం కార్నర్

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

వెంకటాపురం(కె): మండలంలోని ఎదిర గ్రామానికి చెందిన వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్సై కొప్పుల తిరుపతి రావు కథనం ప్రకారం.. ఎదిర గ్రామానికి చెందిన కారం పవన్ కళ్యాణ్ (26) కొంత కాలంగా మద్యానికి బానిసై రోజు మద్యం సేవిస్తూ ఇంటి పనులు పట్టించుకోకుండా తిరుగుతూ ఉండేవాడని తెలిపారు. రోజు మద్యం తాగవద్దని కుటుంబ సభ్యులు ఎంత చెప్పినా వినకుండా మద్యం సేవిస్తున్నాడని తెలిపారు. శనివారం ఉదయం మద్యం సేవించేందుకు డబ్బులు ఇవ్వాలని కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడని తెలిపారు. దీంతో మృతుడి భార్య గౌరిదేవి మద్యం మానేయకపోతే తాను పుట్టింటికి పోతానని బెదిరించడంతో మద్యం మత్తులో ఇంట్లో ఉన్న పవన్ కళ్యాణ్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్పాడ్డాడని తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు ఎదిర ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వెంకటాపురం వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న ఏఆర్ కానిస్టేబుల్ మృతి

ములుగు రూరల్: చికిత్స పొందుతూ ఏఆర్ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన జిల్లాలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాడ్వాయి మండలం కామారం గ్రామానికి చెందిన రేగ చొక్కారావు (43) ఏఆర్ కానిస్టేబుల్ ములుగులో విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం వెన్నుభాగంలో తీవ్రనొప్పి వస్తుందని కుటుంబ సభ్యులకు తెలుపగా వారు ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు చొక్కారావు మృతిపై అడగగా గుండెపోటుతో మృతి చెందాడని తెలిపినట్లు తెలిపారని అన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లు ఉన్నారు.

దేవగిరిపట్నంలో మహిళ..

ములుగు రూరల్: భార్యాభర్తలు ఇద్దరు గొడవ పడి మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని దేవగిరిపట్నంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దేవగిరిపట్నంకు చెందిన యాంపాటి ప్రభ(46) భర్తతో గొడవపడి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. భర్త సుబ్బారెడ్డి గ్రామంలో మరో వ్యక్తికి అప్పు విషయంలో మధ్యవర్తిత్వం వ్యవహరించి అప్పు తీసుకున్న వ్యక్తి డబ్బులు చెల్లించకపోవడంతో భార్య భర్తలు గొడవపడ్డారు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈనెల 18న ఆత్మహత్యకు యత్నించగా గమనించిన ఇంటి చుట్టుపక్కల వారు ములుగు ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా శనివారం మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి కుటుంబసభ్యుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

వంట సామగ్రి పంపిణీ

వాజేడు: మధ్యాహ్న భోజన కార్యక్రమానికి సంబంధించిన వంట సామగ్రిని ఎంఈఓ వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. స్థానిక ఎంఈఓ కార్యాలయం ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల పరిధిలోని 42 పాఠశాలలకు వీటిని అందించారు.